ప్రజాశక్తి

శుక్రవారం 16 మే 2025





జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంగా గుత్తిలో టిడిపి అభిమానులకు అభివాదం చేస్తున్న మంత్రి నారా లోకేష్

చినుకుపడితే గుబులు

- 'అనంత'ను భయపెడుతున్న వర్షం
- వానొస్తే కాలనీలు జలమయం
- గురువారం నాడు మూడు కాలనీల్లోకి నీరు
- రెస్క్యూ చేసి కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



ప్రజాశక్తి కాలనీలో నీటిలో చిక్కుకున్న బాలున్ని బయటకు తీసుకుని వస్తున్న రెస్క్యూ టీం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగర శివార్లలో చినుకుపడితే ప్రజల్లో గుబులు పుడుతోంది. ఎప్పుడు ఏ కాలనీలోకి నీరొచ్చి ముంచేస్తుందోనన్న భయం వెంటాడుతోంది. వరుసగా ఇటువంటి ఘటనలే ఇటీవలి కాలంలో చోటు చేసుకుంటున్నాయి. అనంతపురం జిల్లా కేంద్రంతో పాటు, సరిహద్దు గ్రామాల్లో బుధవారం రాత్రి వర్షం దంచికొంట్టింది. అర్ధరాత్రి తర్వాతతో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. గురువారం ఉదయం 5 గంటల వరకు వర్షం కొనసాగింది. వర్షం ధాటికి అనంతపురం నగర శివారులోని పలు కాలనీలు జలమయం అయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరింది. ఉన్నఫలంగా నీరు చేరడంతో ప్రజాశక్తి నగర్, సిపిఐ కాలనీ, కక్కలపల్లి ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో కట్టుబట్టలతో జనం బయటకు రావాల్సి వచ్చింది. నీటిలో చిక్కుకున్న పిల్లలు, వృద్ధులను అగ్నిమాపిక సిబ్బంది బయటకు తీసుకొచ్చారు. గురువారం రాత్రి కూడా వర్షముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న వారు బిక్కుబిక్కు మంటూ ఉంటున్నారు.



మహిళను నీటి నుంచి బయటకు తీసుకొస్తున్న రెస్క్యూ టీం



నీట మునిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్



రాప్తాడు వద్ద ప్రవహిస్తున్న పండమేరు వంక

నగర శివారు కాలనీలు జలమయం

అనంతపురం జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. అత్యధికంగా రాప్తాడు మండలంలో 141.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. ఇంత పెద్దఎత్తున వర్షం పడటంతో రాప్తాడు దిగువ భాగంలోనున్న గంగులకుంట, జంగాపల్లి చెరువులు నిండి కిందకు ప్రవహించాయి. ఈ సమయంలో కల్వర్టుల్లో పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉండటంతో నీరు పక్కన్ను సిపిఐ కాలనీలోకి చేరాయి. ఉన్నఫలంగా నీరు కాలనీలోకి చేరడంతో ఇళ్లలోని నిత్యావసరాలన్నీ నీటిలో మునిగాయి. భయపడిన స్థానికులు సమాచారాన్ని అగ్నిమాపక శాఖకు తెలియజేయడంతో రెస్క్యూటీమ్‌లు అక్కడికి చేరుకుని వృద్ధులు, పిల్లలను బయటకు తీశారు. ఇదే పరిస్థితి దిగువనున్న లేపాక్షి కాలనీలోకి నీరు చేరి జలమయంగా మారింది. కక్కలపల్లి, ప్రజాశక్తి కాలనీలకు ఆనుకుని ఉన్న ప్రజాశక్తి నగర్‌లో వంకలు ఉధృతంగా ప్రవహించాయి. సమాచారం తెలిసిన వెంటనే రెవెన్యూ, విద్యుత్ శాఖలు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు. ఇళ్లలోకి నీరు చేరిన వారికి భోజన వసతిని కల్పించారు.

రాప్తాడులో అత్యధికం

అనంతపురం జిల్లాలో చూసినప్పుడు గురువారం తెల్లవారుజామున అత్యధికంగా రాప్తాడు మండలంలో వర్షపాతం నమోదయింది. 141.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. ఆ తరువాత కళ్యాణదుర్గంలో 53.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. ఆత్మకూరు మండలంలో 38 మిల్లిమీటర్లు, బ్రహ్మసముద్రంలో 35, బుక్కరాయసముద్రం 34, శెట్టూరు 27.6, పామిడి 26.4, నార్పలలో 25.6, అనంతపురం 24.6 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లా వ్యాప్తంగా 16.9 మిల్లీమీటర్లు సగటు వర్షపాతం నమోదయింది.

నిత్యావసరాలన్నీ తడిచిపోయాయి

బుధవారం అర్ధరాత్రి నుంచి వర్షం జోరుగా కురిసింది. గురువారం తెల్లవారుజామున ఇళ్లలోకి నీరు చేరింది. బియ్యం, బట్టలు అన్నీ తడిచిపోయాయి. కట్టుబట్టలతో బయటపడాల్సి వచ్చింది. ఎగువ భాగంలో వర్షం బాగాపడటంతో కల్వర్టుల వద్ద నుంచి కాలనీలోకి నీరు చేరాయి.

లక్ష్మిదేవి, బాధితురాలు,
ప్రజాశక్తి కాలనీ.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- విద్యా, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్
- గుత్తిలో కార్యకర్తలతో సమావేశం
- నేడు బేతాపల్లి వద్ద రెన్యూ విండ్ ఎనర్జీ ప్రారంభోత్సవం



ప్రజాశక్తి-గుత్తి, అనంతపురం

అధికారంలో లేని సమయంలో పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తను గుర్తుంచుకుని వారి అభివృద్ధికి కృషి చేయనున్నట్లు రాష్ట్ర విద్యా, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా అనంతపురానికి గురువారం ఆయన విచ్చేశారు. గుత్తి మండల పరిధిలోని బేతాపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు గురువారం మధ్యాహ్నం 1.25 నిమిషాలకు చేరుకున్నారు. హెలీప్యాడ్ వద్ద నారా లోకేష్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అనంతపురం, హిందూపురం ఎంపీలు అంబికా లక్ష్మీ నారాయణ, పార్థసారథి, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరామ్, బండారు శ్రావణిశ్రీ, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, పల్లె సింధూరరెడ్డి, కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్, జేసీ శివ నారాయణ శర్మ, అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజు తదితరులు పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం బేతాపల్లి గ్రామం నుంచి భారీ కాన్వాయ్ ద్వారా గుత్తి అర్‌ఎస్ నుంచి గుత్తి పట్టణం మీదుగా పట్టణ శివార్లలో మాసినేని పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన శిబిరానికి లోకేష్ చేరుకున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి టీడీపీ ఉత్తమ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు. కార్యకర్తల అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ నాయకులతో మంత్రి లోకేష్ భేటీ అయ్యి గుంతకల్లు నియోజకవర్గంలో పార్టీ స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ పటిష్టతకు కషి చేయాలని నాయకులకు మంత్రి లోకేష్ సూచించారు. శుక్ర, శనివారాలు రెండు రోజులు కూడా నారా లోకేష్ జిల్లాలో ఉండనున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంతో టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నారు.

నేడు రెన్యూ విండ్ ఎనర్జీ ప్రారంభోత్సవం

గుత్తి మండలం బేతాపల్లి వద్ద ఏర్పాటు చేస్తున్న రెన్యూ విండ్ ఎనర్జీ (జెఎంబి) ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నారా లోకేష్ శుక్రవారం పాల్గొనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే అధికారులు పూర్తి చేశారు. ఈ కార్యక్రమం అనంతరం ఆయన అనంతపురం వెళ్తారు. అక్కడ కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కూతురు వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. సాయంత్రం అనంతపురం అర్బన్ టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహిస్తారు. శనివారం నాడు అనంతపురం జెఎన్‌టియులో నిర్వహించే 14వ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి పాల్గొంటారు.

మడకశిర ఛైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

టిడిపి వశం కానున్న నగర పంచాయతీ



అవిశ్వాసానికి మద్దతుగా చేయి ఎత్తి ఓటు వేస్తున్న ఎమ్మెల్యే కౌన్సిలర్లు

ప్రజాశక్తి-మడకశిర

మడకశిర మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లపై ప్రవేశపెట్టిన అవిశ్వాత తీర్మానం నెగ్గింది. మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతుగా ఓటేశారు. దీంతో ప్రస్తుత ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు వారి పదవులను కోల్పోయారు. మడకశిర నగర పంచాయతీ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ అఫిషియో సభ్యుని స్థానంలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజుతో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు. మడకశిర నగర పంచాయతీలో 20 మంది కౌన్సిలర్లు ఉండగా 14మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతుగా చేతులు ఎత్తి ఆమోదం తెలిపారు. ఎక్స్ అఫిషియో సభ్యుని ఓటుతో కలిసి అవిశ్వాసానికి 15 ఓట్లు పడ్డాయి. మిగిలిన ఆరుగురు వైసిపి కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. గత మున్సిపల్ ఎన్నికల్లో వైసిపి అత్యధిక స్థానాల్లో గెలుపొంది మడకశిర నగర పంచాయతీని కైవసం చేసుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి విజయం సాధించడంతో పరిస్థితులు మారాయి. ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో మెజార్టీ వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. దీంతో ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. అవిశ్వాసం తీర్మానం నెగ్గడంతో త్వరలో టిడిపి మద్దతుతో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నిక జరగనుంది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నరసింహారాజు, ఉమా శంకర్, శ్రీనివాసులు, వెంకట లక్ష్మమ్మ, ఓబులమ్మ శ్రీనివాస్, శంకర్ నాయక్, లక్ష్మయ్య, ప్రభావతి హనుమంతు , ప్రియాంక విక్రమ్, పార్వతమ్మ దాసప్ప, సుజాత మేఘన రమేష్, సుభద్ర నాగేంద్ర, సావిత్రమ్మ బలరాం, సిద్ధప్ప, పాల్గొన్నారు.

వంకలకు సైడ్ వాల్స్ నిర్మించండి : సిపిఎం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఎప్పుడు వర్షం కురిసినా అనంతపురం రూరల్ కాలనీలు జలమయం అయ్యి నీరు ఇళ్లలో చేరుతోందని, ప్రజల ఇబ్బందులను గుర్తించి ఆయా ప్రాంతాల్లో వంకలకు రక్షణ గోడలు నిర్మించాలని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కురిసిన వర్షానికి అనంతపురం రూరల్ మండల పరిధిలోని ప్రజాశక్తి కాలనీ పూర్తి జలమయమైంది. ఇళ్లలో వర్షపు నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆయా కాలనీల్లో సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ముత్తుజ, ఇర్ఫాన్ ఆధ్వర్యంలో కాలనీ యువజన సంఘం, పార్టీ నాయకులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకులు ఎన్నికల ముందు వంకల సైడ్ వాల్స్ నిర్మిస్తామని వాగ్దానం చేయడం ఎన్నికైన తర్వాత మరిచిపోవడం అలవాటుగా మారిందన్నారు. ఎవరు అధికారంలో ఉన్న ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కాలనీలో ఉన్న మోరీలను తొలగించి బ్రిడ్జిని నిర్మించాలని ఎన్ని మార్లు అధికారులకు, పాలకులకు మొర పెట్టుకున్న సమస్య పరిష్కరించలేదని తెలిపారు. ప్రజాశక్తి కాలనీలో ఏ ఇంట్లో చూసిన కరెంటు షాక్ కొడుతోందన్నారు. విద్యుత్ అధికారులకు ఈ సమస్యను విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. వరదలు వచ్చినప్పుడు అధికారులు హడావుడి చేయడం తప్ప సమస్య పరిష్కరించ లేదని విమర్శించారు. కాలనీల్లో వర్షానికి ధాన్యం, ఇతర సామగ్రి తడిసిపోయి నష్టపోయిన కుటుంబాలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి శ్రీనివాసులు, గౌస్, గోపాల్, అల్లాబకాస్, వార్డు మెంబర్ కుళ్లాయమ్మ పాల్గొన్నారు.



ప్రజాశక్తి నగర్‌లో వరద ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు



ఫలితాలను విడుదల చేస్తున్న జెఎన్‌టియు అధికారులు

జెఎన్‌టియు ఎంటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో మర్చి నెలలో నిర్వహించిన ఫార్మ డి, ఎం.టెక్ నాలుగవ సంవత్సరం (ఆర్ 17) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను గురువారం విడుదల చేశారు. వైస్ ఛాన్సలర్ హెచ్.సుదర్శన రావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య ఆదేశాల మేరకు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ వి.నాగ ప్రసాద్ నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఎపి.శివ కుమార్, అడిషినల్ కంట్రోలర్స్ జి.శంకర్, శేఖర్ రాజు, డా॥ఎం.అంకారావు, డా॥ఎస్. శ్రీధర్‌లు వీటిని విడుదల చేశారు. పరీక్షా ఫలితాల కోసం www.jntuaresults.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

17న అనంతలో తిరంగా ర్యాలీ

పాల్గొననున్న మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 17వ తేదీన అనంతపురం నగరంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. 17వ తేదీ ఉదయం 7.30 గంటలకు ఈ ర్యాలీ ప్రారంభమవుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరవుతున్నట్లు తెలిపారు. నగరంలోని ఆర్ట్స్ కాలేజ్ నుంచి టవర్ క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

గవర్నర్ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- ఎలాంటి లోటుపాట్లు ఉండరాదు..
- కలెక్టర్ డా॥వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు విచ్చేస్తున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటన కోసం పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గవర్నర్ జిల్లా పర్యటన సందర్భంగా అనంతపురం నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గహంలో సంబంధిత ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 17వ తేదీన గవర్నర్ జెఎన్‌టియు స్నాతకోత్సవంలో పాల్గొంటున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్‌అండ్‌బి అతిథి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఎక్కడా ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఆర్డీవో కేశవ నాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, ఆర్‌అండ్‌బి డిఈ కాటమయ్య, సివిల్ సప్లయ్ డిఎం రమేష్ రెడ్డి, డిఎస్‌ఒ మునిప్రసాద్, తహశీల్దార్లు హరిప్రసాద్, బ్రహ్మయ్య, రియాజ్ బాషా పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

వైభవంగా ప్రసన్న వెంకటరమణస్వామి కళ్యాణోత్సవం



ప్రసన్న వెంకటరమణస్వామి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో వెలసిన ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో గురువారం కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పెళ్లికూతురు పద్మావతి(ధన్య)ని నేసేపేటలోని భక్త మార్కండేయస్వామి ఆలయం నుంచి కోటలోని వెంకటరమణస్వామి ఆలయానికి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొ చ్చారు. కళ్యాణ వేదికపై పురోహితులు సంప్రదాయబద్ధంగా వివాహం నిర్వహించారు. కాలవ భరత్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కళ్యాణోత్సవంలో భాగంగా పెళ్లికూతురు పద్మావతి(ధన్య) మెడలో ఆమె తల్లి పసుపు తాడు కట్టారు. అంతకుముందు గర్భగుడిలో స్వామివారి మూలవిరాట్‌ను పూలు, ఆభరణాలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంపై ఉంచి గరుడ వాహనోత్సవం నిర్వహించారు. కోటలోని వెంకటరమణస్వామి ఆలయం నుంచి కోటముఖద్వారం, తేరువీధి, వినాయక కూడలి మీదుగా బళ్లారి రోడ్డులోని భక్త మార్కండేయ స్వామి ఆలయం వరకూ గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలవ సతీమణి విజయలక్ష్మి, కోడలు నిర్మల, సమూహ దేవాలయాల ఈవో కె.నరసింహారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోరాలు శిల్ప, గౌని ఉపేంద్ర రెడ్డి, నల్లపూల వెంకటేశులు, చుంచుల నాగప్ప, ఆరవ శివప్ప, పుర ప్రముఖులు, పద్మశాలి, తొగటవీర క్షత్రియ, స్వకులశాలి, భవసార క్షత్రియ సామాజిక వర్గాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మార్పు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు నగర్‌లో ఇళ్ల మధ్యన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు మార్చారు. ఇటీవల చంద్రబాబు నాయుడు కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంలో ట్రాన్స ఫార్మర్ సమస్యను స్థానిక టిడిపి నాయకులు, కాలనీ వాసులు తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అక్కడి నుంచి ట్రాన్స ఫార్మర్ తీసివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు గురువారం నాడు నివాస ప్రాంతాల మధ్యన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రాంతానికి మార్చారు.

గ్రామాల్లో నిరుపయోగంగా నీటి తొట్టెలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

వేసవి దృష్ట్యా పశువులు, మూగజీవాల దాహార్తి తీర్చేందు కోసం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ చట్టం కింద నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. అయితే వాటిలో నీరు నింపకపోవడంతో నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రధానంగా మండలంలోని బండూరు, ఉద్దేహాల్, పొన్నూరు, కురవల్లి, నేమకల్లు, గోవిందవాడ, శ్రీధరఘట్ట, గోనెహాల్, కొలగానహల్లి, లింగదహాల్ తదితర గ్రామాల్లో నీటి తొట్టెలు నిర్మించినా నీరు నింపకపోవడతంఓ నిరుపయోగంగా పడి ఉన్నాయి. దీంతో పశువులకు నీటి కష్టాలు తప్పడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి నీటి తొట్టెల్లో ఎప్పటికప్పుడు నీరు నింపి పశువులు, మూగజీవాల దాహార్తి తీర్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపిడిఒ విజయభాస్కర్‌ను వివరణ కోరగా ఎప్పటికప్పుడు తొట్టెల్లో నీరు నింపాలని ఉపాధి హామీ సిబ్బంది, సర్పంచులకు సూచించామని తెలిపారు.



బండూరులో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టె

పసలూరులో తాగునీటి కష్టాలు..!

పట్టించుకోని అధికారులు



నీటికోసం ఎదురుచూస్తున్న వృద్ధురాలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

జిల్లాకేంద్రానికి అతి సమీపంలో ఉన్న బుక్కరాయసముద్రం మండలంలోని పసలూరు దళితకాలనీలో తాగునీటి కష్టాలు తారాస్థాయికి చేరాయి. తాగునీటి సమస్య ఏర్పడి నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని స్థానికులు వాపోతున్నారు. పసలూరు గ్రామంలో దాదాపు వంద దళిత కుటుంబాలు ఉన్నాయి. నీటి సమస్య తలెత్తడంతో ఆయా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. దాదాపు 10 నెలలుగా తాగునీటి సమస్య నెలకొందని అంటున్నారు. సమస్యను పరిష్కరించాలని సచివాలయంలో అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ముఖ్యంగా నీటి సమస్య అడిగేందుకు వెళ్తే పంచాయతీ కార్యదర్శి వివక్షతో మాట్లాడుతూ గ్రామంలో సమస్యలు సృష్టిస్తున్నాడని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులతోపాటు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ స్పందించి పసలూరు దళిత కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

ఎపి కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పి.జమలయ్య

ప్రజాశక్తి-పుట్లూరు

అకాల వర్షాలు, ఈదురు గాలులకు పంటలు దెబ్బతిన్న రైతులకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కడవకల్లు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు, ఈదురు గాలులకు దెబ్బతిన్న పంటలకు 24 గంటల్లో నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని వాగ్దానం చేసిన సిఎం చంద్రబాబు పంటలు నష్టపోయి రెండు నెలలైనా ఒక్కపైసా అందించలేదన్నారు. గత రెండు నెలల నుంచి రాష్ట్రంలో ఆహార పంటలు 15,000 ఎకరాలు, 5వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయన్నారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే తీరా చేతికి వచ్చే సమయానికి వర్షాలు, ఈదురు గాలులు, వడగండ్ల వానలకు పంటలు దెబ్బతినడంతో రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆహార పంటలకు రూ.30వేలు, ఉద్యానవన పంటలకు రూ.75వేలు, వాణిజ్య పంటలకు రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతాంగం అప్పుల భారంతో కొట్టుమిట్టాడుతున్న నేపథ్యంలో పంట రుణాలు మాఫీ చేయాలన్నారు. పెరిగిన సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకుని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు అందించాలన్నారు. ఇకపోతే జిల్లాలో పండించిన ధాన్యాన్ని సేకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రైతాంగ ఆత్మహత్యలను నివారించడానికి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. బలవన్మరణానికి పాల్పడిన బాధిత రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు విటి రామాంజనేయులు, రైతుసంఘం మండల అధ్యక్షులు ఎన్.గోపాలకృష్ణ, మండల కార్యదర్శి సత్తార్ గోపాల్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్న కుళ్లాయప్ప, రైతు సంఘం ఉపాధ్యక్షులు బి.చిన్నికృష్ణుడు యాదవ్, మండల రైతు సంఘం నాయకులు బి.ఓబుళరెడ్డి, కె.పెద్దముని, బి.గురుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం.!

కాలువపై విద్యుత్ తీగలు-భయాందోళనలో స్థానికులు



కాలువపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలోని కల్లూరు గ్రామ సమీపంలో ఉన్న చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి వచ్చే పిబిసి కాలువలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. అందులోనూ ఇనుప పైపునకు అనుకుని విద్యుత్ తీగలు ఉండటంతో రైతులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అసలే వేసవి కాలం కావడంతో పిల్లలు, పెద్దలు కాలువ వద్దకు ఈతకు వెళ్తుంటారు. ఈనేపథ్యంలో ఏ ప్రమాదం జరకముందే ఉన్నతాధికారులుస్పందించి స్తంభాలపై విద్యుత్ తీగలు అమర్చాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఆర్డీటీని కాపాడుకుందాం

సేవ్ ఆర్డీటీ జెఎసి కన్వీనర్ సాకే రామాంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న సేవ్ ఆర్డీటీ జెఎసి కన్వీనర్ సాకే రామాంజనేయులు

ప్రజాశక్తి-నార్పల

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎ రెన్యువల్‌కు అడ్డంకులు తొలగించేంత వరకూ గ్రామస్థాయి నుంచి పోరాటాలకు సిద్ధం కావాలని సేవ్ ఆర్డీటీ జెఎసి కన్వీనర్ సాకే రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎ రెన్యువల్‌ను అడ్డుకోవడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం మండలంలోని బండ్లపల్లి, బి.పప్పూరు, బొందలవాడ గ్రామాల్లో సేవ్ ఆర్డీటీ జెఎసి కమిటీ సభ్యులు ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తోందన్నారు. ఈనేపథ్యంలో ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించకపోతే సేవా కార్యక్రమాలన్నీ నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి ఎఫ్‌సిఆర్ఎ రెన్యువల్ చేసేంత వరకూ పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ రంగాపురం పుల్లప్ప, శోదనపల్లి సూర్యనారాయణ, సిద్ధరాచర్ల శివయ్య, గంగాధర్, టైలర్ సుధాకర్, సూరి, చేపల రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రక్త నమూనాల సేకరణ



రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని చిన్న జలాలపురం గ్రామంలో బోధకాలు వ్యాధి (ఫైలేరియా)కు సంబంధించిన రక్త నమూనాలను గురువారం రాత్రి సేకరించారు. ఇందులో భాగంగా తరిమెల వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో తరిమెల వైద్య సిబ్బంది, మలేరియా సిబ్బంది ఆరు బృందాలుగా ఏర్పడి దాదాపు 304 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి తరిమెల పిహెచ్‌సి ల్యాబ్‌కు పంపారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్ సిబ్బంది నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి, తరిమెల పిహెచ్‌సి సిహెచ్ఒ గంగాధర్, సూపర్‌వైజర్ అశ్వర్థనారాయణ, సచివాలయ ఎఎన్ఎంలు శైలజ, వరలక్ష్మి, ఆశాబీ, జయమ్మ, ప్రమీలమ్మ, రామాంజనమ్మ, హేమలత, ఆరోగ్య కార్యకర్తలు నాగరాజు, గీత, మోహనమ్మ, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, రామలక్ష్మి, ఆదిలక్ష్మి, లక్ష్మీకళ, స్వాతిబాయి, కవిత, మదారబీ, తదితరులు పాల్గొన్నారు.

కెఎస్ బాబుకు నివాళి



కెఎస్ బాబుకు నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు కెఎస్ బాబు వర్ధంతిని పురస్కరించుకుని వైసిపి ఎస్సీ సెల్ నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక హెచ్ఎల్‌సి కాలనీలో ఉన్న ఘాట్ వద్ద నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ అర్బన్ నియోజకవర్గ అధ్యక్షులు పసలూరి ఓబిలేసు మాట్లాడుతూ కెఎస్ బాబు దళితుల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. విద్యార్థి దశ నుంచే ప్రజా జీవితంలో ఉంటూ ప్రత్యేకంగా దళితుల కోసం పని చేశారన్నారు. మాదిగ ఉద్యమం ప్రారంభ దశలో బలమైన శక్తిగా ఎదిగి జిల్లాలో ఎదురులేని నాయకుడుగా గుర్తింపు పొందాడని గుర్తు చేశారు. అదేవిధంగా వైఎస్ఆర్ కుటుంబం ఎంతో బలమైన అనుబంధం కొనసాగించారని గుర్తు చేశారు. రాజారెడ్డి నుంచి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వరకు సంబంధాలు కొనసాగించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ నాయకులు సాకే అశోక్, యాకోబ్, ఎంహెచ్‌పిఎస్ కడప జిల్లా అధ్యక్షులు అప్పాయపల్లి గంగులయ్య, అనంతపురం అధ్యక్షులు మదిగుబ్బ ఓబుళప్ప, బిసి సేన రాష్ట్ర అధ్యక్షులు చంద్రాచర్ల హరి, కెఎస్ బాబు తనయు సన్నీ, సోను, ఎంసి రంగస్వామి, గ్రేటర్ రాయలసీమ ఇన్‌ఛార్జి మన్నీల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

226 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో జెఎన్‌టియు సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

అనంత పురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న 226 మంది విద్యార్థులు వివిధ మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించినట్లు ఉపకులపతి హెచ్.సుదర్శరావు తెలిపారు. గురువారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పరీక్షలు నెగ్గి ఉద్యోగాలు సాధించారు. వీరిలో 10 మంది అత్యధిక వార్షిక వేతనంగా రూ.11లక్షలతో టీసీఎస్‌లో ఫ్యాక్టసెట్‌లో ఉద్యోగాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఓఎస్‌డి విసి ఎన్.దేవన్న, ఆర్.కిరణ్మయి, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, ప్రాంగణ నియామకాల అధికారి జె.శ్రీనివాసులు, తదితరులు విద్యార్థులను అభినందించారు.

డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించండి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి దేవి



పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి దేవి సూచించారు. మే 16న జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక డిఎంహెచ్ఒ కార్యాలయంలో జిల్లా మలేరియా అధికారి డి.ఓబులుతో కలిసి ఇందుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా విభాగంలో పని చేస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, పిహెచ్‌సిల సిబ్బంది కలిసి వర్షాకాల సీజన్ ప్రారంభానికి ముందే ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా డెంగీ వ్యాధి ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి పి.యుగంధర్, ప్రోగ్రాం అధికారులు నారాయణస్వామి, డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, డిప్యూటీ హెచ్ఇఒ గంగాధర్, ఆఫీసు సూపరిండెంటెంట్ శ్రీలత, సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్లు నూరుబాషా, శ్రీధర్‌మూర్తి, రమేష్, లోకేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



శింగనమల మండలం సోదనపల్లిలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-శింగనమల

కిషోర్ వికాసం కార్యక్రమంలో భాగంగా సిడిపిఒ ఉమా శంకరమ్మ ఆదేశాల మేరకు గురువారం మండల పరిధిలోని సోదనపల్లి అంగన్వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా కిశోర బాలికలకు వివాహాలు చేస్తే కలిగే అనర్థాలు, దుష్ప్రభావాలను వివరించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ గాయత్రి మాట్లాడుతూ 18ఏళ్లలోపు బాలికలు వివాహం చేసుకోకూడదన్నారు. బాల్య వివాహాలు చేస్తే బాలికలకు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. కావున బాలికలకు వివాహ వయస్సు వచ్చిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. ఒకవేళ ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తే 1098 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు టి.రత్నమ్మ, బి.సరస్వతి, అంగన్వాడీ ఆయా రామాంజనమ్మ, కిషోర్ బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, సిహెచ్ఒ నాగరంగయ్య బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణ, పిసిపిఎన్‌డిటి చట్టంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్‌నర్సులు సునీత, జినాతున్నీసా, కుమారిబాయి, హెల్త్ సూపర్‌వైజర్ స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదులో తప్పులు రానీయొద్దు

తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య

ప్రజాశక్తి -శింగనమల

ఓటరు నమోదు ఎలాంటి లోటుపాట్లు రానీయకుండా చూడాలని తహశీల్దార్ బ్రహ్మయ్య ఆయా పార్టీ నాయకులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో అఖిలపక్ష పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బ్రహ్మయ్య మాట్లాడుతూ ఓటరు నమోదు కార్యక్రమాల్లో అవకతవకలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ముఖ్యంగా చేర్పులు, మార్పులు, తొలగింపుల్లో బీఎల్వోలు కీలకపాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావు, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, ఎలక్షన్ డిటి, సిపిఐ ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు చిన్నప్పయాదవ్, వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఎన్‌వి నారాయణ, జనసేన పార్టీ నాయకులు సాయి శంకర్, రామాంజనేయులు, టిడిపి నాయకులు వెంకటేష్, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సాంబశివారెడ్డికి ఆక్లాండ్‌లో స్వాగతం పలుకుతున్న వైసిపి నాయకులు

సాంబశివారెడ్డికి ఆక్లాండ్‌లో ఘన స్వాగతం

శింగనమల : వైసిపి ఎన్ఆర్ఐ విభాగ గ్లోబల్ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డికి న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ విమానాశ్రయంలో వైసిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఇందులో భాగంగా వైసిపి న్యూజిలాండ్ కన్వీనర్ బుజ్జిబాబు నెల్లూరు, కో-కన్వీనర్లు ఆనంద్ ఎద్దుల, సమంత్ డేగపూడి నేతృత్వంలో న్యూజిలాండ్ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతించారు. పర్యటనలో భాగంగా మే 17న ఆక్లాండ్‌లో గ్లోబల్ కనెక్ట్ మీటింగ్ నిర్వహించనున్నారు.

మజ్జిగ కేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న నాగభూషణ్‌రెడ్డి

తాడిపత్రి : తాడిపత్రి మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు గురువారం ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నాగభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ పల్లెల నుంచి కోర్టు పనులు నిమిత్తం, తహశీల్దార్ కార్యాలయం పని నిమిత్తం అనేకమంది వస్తుంటారన్నారు. వారి సౌకర్యార్థం మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

శివాలయం భూమి కౌలుకు వేలం

పెద్దవడుగూరు : పెద్దవడుగూరులోని పేటశివాలయ మాన్యం భూమిని ఈఏడాదిలో కౌలుకు తీసుకునేందుకు గురువారం వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నాగిరెడ్డి వేలంపాట పాడి దక్కించుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయానికి సంబంధించిన సర్వేనెంబరు 672లో 9ఎకరాలు ఆధీనంలో ఉండగా ఏటా కౌలుకు వేలం ద్వారా రైతులు దక్కించుకునేవారు. ఇందులో భాగంగానే ఈఏడాది ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటలో నాగిరెడ్డి రూ.38,000కు దక్కించుకున్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన

పెద్దవడుగూరు : పెద్దవడుగూరులోని వంక కాలనీలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ట ఘనంగా చేపట్టారు. గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఉదయం నుంచి గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, గంగపూజ ఋత్విగణం, పంచగవ్యమేళనం ప్రాసన, యాగశాలప్రవేశం, ప్రధాన స్థారిత కలశ పూజ, అఖండ దీపారాధన, నవగ్రహ మూలమంత్ర జపాలు, అగ్ని ప్రతిష్టాపన, విగ్రహజలాధివాసం, సాయం దీక్షాహోమం మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించి పూజలు చేశారు.

ఈ-సెట్ ఫలితాల్లో యాడికి విద్యార్థి ప్రతిభ

యాడికి : రాష్ట్రస్థాయిలో గురువారం వెలువడిన ఈ-సెట్ ఫలితాల్లో మండల పరిధిలోని రాయలచెరువు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త పఠాన్ టోపీఖాన్ కుమారుడు పఠాన్ రఖీబ్‌ఖాన్ 3వ ర్యాంకు సాధించాడు. దీంతో రాయలచెరువు పారిశ్రామిక వేత్తలు మండల ప్రజలు రఖీబ్ ఖాన్ ప్రతిభను మెచ్చుకుంటూ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఘనంగా ఖాజా బందే నవాజ్ ఉరుసు



ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లిములు

ప్రజాశక్తి-గుత్తి

గుత్తిలో హజరత్ ఖాజా బంధే నవాజ్ గ్రేస్ దాస్ ఉరుసు సందర్భంగా గురువారం స్వామివారి గంధాన్ని మేళతాళాలతో పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. గుత్తి కోట వీధిలోని కొండపై దర్గా వరకు గంధం ఊరేగింపు కొనసాగింది. ముందుగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, చక్కెర చదివింపులు చేశారు. బుధవారం రాత్రి ప్రత్యేక భయాన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మదరసాలో ఖురాన్ పూర్తి చేసిన విద్యార్థులకు ఖురాన్ పుస్తకాలను క్రాంతి టైలర్ ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దల చేతుల మీదుగా అందజేశారు. దర్గా అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రాత్రి దర్గా ఆవరణలో గొప్ప ఖవాళీ కార్యక్రమం చేపట్టారు. భక్తులకు దర్గాలో అన్నదానం చేశారు.

మంత్రి లోకేష్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



నారా లోకేష్‌కు పూలమొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల : జిల్లా పర్యటనకు విచ్చేసిన ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ స్వాగతం పలికారు. ఇందులో భాగంగా పూలమొక్క అందజేశారు. ఇందులో భాగంగా నియోజకవర్గం మండలాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.

ఎంఐఎఫ్ బలోపేతమే లక్ష్యం

ఉరవకొండ : ఎంఆర్‌పిఎస్ అనుబంధ సంస్థ మాదిగ ఉద్యోగుల సమైక్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా సభ్యత్వ నమోదును చేపట్టామని ఎంఐఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ తెలిపారు. ఈమేరకు గురువారం ఉరవకొండలో ఎంఐఎఫ్ జిల్లా గౌరవ సలహాదారులు సాకే భాస్కర్ రూ.వెయ్యి ఇచ్చి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎఫ్ జిల్లా అధ్యక్షులు మన్నెపాకుల రమేష్, జిల్లా కమిటీ సభ్యులు మీనుగ భాస్కర్‌బాబు, బండారు నాగేంద్ర, నియోజకవర్గ అధ్యక్షులు సింగాడి దుర్గాప్రసాద్, రొక్కరూకల శ్రీనివాసులు, జెన్నే సుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఎఇగా పద్మనాభరెడ్డి



యల్లనూరు : విద్యుత్ ఎఇగా పద్మనాభరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలల క్రితం బదిలీలో భాగంగా యల్లనూరు విద్యుత్ ఎఇగా పని చేసిన పద్మనాభరెడ్డి కడపకు బదిలీ అయ్యారు. ఇక్కడ రవీంద్ర బాధ్యతలు చేపట్టారు. ఈనేపథ్యంలో మ్యూచువల్ బదిలీలో భాగంగా రవీంద్ర కడపకు వెళ్లగా పద్మనాభరెడ్డి యల్లనూరుకు వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

నేడు రక్తదాన శిబిరం


నార్పల : మండల కేంద్రంలోని నార్పల క్రాసింగ్ సమీపంలో తాడపత్రి రోడ్డులో ఉన్న కాఫీ టైం టీ స్టాల్‌లో అమరవీరులు మురళీనాయక్, సుబ్బయ్యకు గుర్తుగా శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు అబ్దుల్ కలాం స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మన్ పీటర్ విజయ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసే వారు సెల్ 85198 83718, 96523 62431, 90522 45007 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఫార్మర్ ఐడి రిజిస్ట్రేషన్ తప్పనిసరి

యల్లనూరు : ప్రతి రైతు తప్పనిసరిగా గుర్తింపు ఐడి పొందాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందాలంటే ఖచ్చితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అలాగే సబ్సిడీ ఎరువులు పార్మర్ ఐడితోనే సాధ్యమన్నారు. కావున రైతులందరూ తప్పనిసరిగా మీ పరిధిలోని రైతు భరోసా సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

నార్పల : బిసి కార్పొరేషన్ ద్వారా మహిళల కోసం తీసుకొచ్చిన ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి నాయకులు ఆకుల విజయకుమార్(బాబు), బిసి కార్పొరేషన్ ఇడి సుబ్రమణ్యం, ఎంపిడిఒ భాస్కర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్యామల, టిడిపి నాయకులు, కార్యకర్తలు, బిసి మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆకుల బాబు, ఎంపిడిఒ భాస్కర్

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ యువకుడు మృతి

గుత్తి : పట్టణంలో భీమ్ రావు కాలనీ (పైమాలవీధి)కి చెందిన ప్రవీణ్ (22) అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈనెల 6న పట్టణంలోని అనంతపురం రోడ్డులో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ప్రవీణ్, సురేశ్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రవీణ్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రవీణ్ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అతన్ని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

గుత్తి : పట్టణంలోని కేంద్రీయ విద్యాలయ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు గుత్తి ఆర్ఎస్ కు చెందిన ఆటో డ్రైవర్ ఆంజనేయులు తన కుటుంబ సభ్యులతో కలిసి పట్టణానికి ఆటోలో బయలుదేరాడు. అయితే కేంద్రీయ విద్యాలయం ఎదురుగా రోడ్డు పక్కన కేబుల్ పనులు నిమిత్తం తవ్వి వదిలేసిన మట్టి దెబ్బపై ఆటో వెళ్లడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోడ్రైవర్ ఆంజనేయులు, అతని భార్య రాణి, ఇద్దరు పిల్లలు గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఆంజనేయులు, రాణి లకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అలాగే పట్టణంలోని ఎంఎస్ ఫుట్‌బాల్ క్రీడా మైదానం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. 44వ జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో సుప్రీత్ అలియాస్ బన్నీ, దినేశ్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం సుప్రీత్‌ను మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.